సాక్షి నాగర్‌కర్నూల్

బుధవారం : 9 : ఏప్రిల్ : 2025



కనులపండువగా పూల రథోత్సవం

సిర్సనగండ్ల సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం తెల్లవారుజామున పూల రథోత్సవం (చిన్నతేరు) కనులపండువగా నిర్వహించారు.
– చారకొండ

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
39.8 /21.1

వాతావరణం
ఉదయం నుంచే ఎండ ఎక్కువగా ఉంటుంది. ఉక్కపోత పెరుగుతుంది. ఆకాశం స్వల్పంగా మేఘావృతమై ఉంటుంది.

శరవేగంగా..

తుది దశకు జాతీయ రహదారి–167కే నిర్మాణం



కొల్లాపూర్ సమీపంలో చేపడుతున్న ఫ్లైఓవర్ నిర్మాణం

- కొల్లాపూర్, కల్వకుర్తి పరిధిలో జూలైలోగా పూర్తిచేసేందుకు చర్యలు
- నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో కొలిక్కిరాని భూసేకరణ
- ఇప్పటికే పూర్తయిన పాత రోడ్డు విస్తరణ పనులు
- త్వరలోనే ఐకానిక్ సస్పెన్సివ్ కేబుల్ బ్రిడ్జికి టెండర్లు

కొల్లాపూర్: నాగర్‌కర్నూల్ జిల్లాలో జాతీయ రహదారి–167కే పనులు శరవేగంగా సాగుతున్నాయి. కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్ నియోజకవర్గాల గుండా వెళ్లే ఈ రహదారి పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారు. గతంలో ఉన్న రహదారి విస్తరణ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. కొల్లాపూర్, కల్వకుర్తి నియోజకవర్గాల్లో బైపాస్ రహదారుల నిర్మాణాలు 90 శాతం మేరకు పూర్తి కాగా.. నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో మాత్రమే బైపాస్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి.

■ భారత్‌మాల పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం తెలంగాణలోని కల్వకుర్తి నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల వరకు జాతీయ రహదారి–167కే మంజూరు చేసింది. ఇందులో భాగంగా మల్లేశ్వరం– సంగమేశ్వరం మధ్యన కృష్ణానదిపై ఐకానిక్ సస్పెన్సివ్ కేబుల్ బ్రిడ్జి నిర్మించనున్నారు. మొదటి ప్యాకేజీలో కల్వకుర్తి నుంచి కొల్లాపూర్ వరకు 85 కి.మీ., మేరకు రహదారి విస్తరణ, బైపాస్, అండర్‌పాస్ నిర్మాణాలు చేపట్టేందుకు 2021 సెప్టెంబర్ 26న టెండర్లు పూర్తిచేశారు. రూ.436.91 కోట్లకు ఆర్‌కే ఇన్‌ఫ్రా టెండర్ దక్కించుకుంది. 2023 జూలైలో కాంట్రాక్టు కంపెనీ పనులను ప్రారంభించింది. పనులు పూర్తిచేసేందుకు రెండేళ్ల గడువు విధించారు. వచ్చే జూలైలో కాంట్రాక్టు కంపెనీ గడువు ముగుస్తుంది. అప్పటిలోగా పనులన్నీ పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టినట్లు కాంట్రాక్టు కంపెనీ ప్రతినిధులు వెల్లడించారు.

ఆరు నెలల గడువు..

జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి నియోజకవర్గాల్లో బైపాస్ రహదారులు నిర్మిస్తున్నారు. ఇందుకోసం భూసేకరణ చేపట్టారు. కొల్లాపూర్, కల్వకుర్తిలో భూ సేకరణ పూర్తికావడంతో బైపాస్ నిర్మాణాలు కూడా తుదిదశకు చేరాయి. నాగర్‌కర్నూల్‌లో మాత్రం భూసేకరణలో జాప్యం నెలకొంది. దీంతో ఈ పనులు పూర్తిచేసేందుకు కాంట్రాక్టు కంపెనీకి ఆరునెలల అదనపు సమయం ఇచ్చేందుకు ఎన్‌హెచ్ అధికారులు సిద్ధమయ్యారు. భూ సేకరణ జరిగిన ప్రాంతాల్లో మాత్రం వచ్చే జూలైలోగా పనులు పూర్తికానున్నాయి.

ఈనెలాఖరు చివరి గడువు

జాతీయ రహదారి–167కేలో భాగంగా 87.36 కి.మీ., నుంచి 88.43 కి.మీ., మధ్యలో కృష్ణానదిపై ఐకానిక్ సస్పెన్సివ్ కేబుల్ బ్రిడ్జి నిర్మించనున్నారు. ఈ పనుల కోసం 2023 అక్టోబర్‌లో టెండర్లు ఆహ్వానించారు. తర్వాతి కాలంలో బ్రిడ్జి నిర్మాణంలో పలు మార్పులు చేయడం వల్ల టెండర్ల గడువును పొడిగిస్తూ వస్తున్నారు. రూ.963 కోట్ల వ్యయంతో నిర్మించే ఈ బ్రిడ్జి పనులకు టెండర్ల గడువును ఈ నెల 29 చివరి గడువుగా విధించారు. టెండర్లలో పాల్గొనేందుకు పలు నేషనల్, ఇంటర్నేషనల్ కంపెనీలు బిడ్లు దాఖలు చేశాయి. మే నెలలో టెండర్లు ఓపెన్ చేసే అవకాశాలు ఉన్నాయి.

రెండు రాష్ట్రాల్లోనూ జోరుగా..

రహదారి నిర్మాణ పనులను ఐదు ప్యాకేజీలుగా విభజించారు. కల్వకుర్తి నుంచి కొల్లాపూర్ వరకు మొదటి ప్యాకేజీ, కృష్ణానదిపై ఐకానిక్ వంతెన రెండో ప్యాకేజీ, వంతెనకు అనుసంధానంగా మల్లేశ్వరం, సంగమేశ్వరం ప్రాంతాల్లో రోడ్డు నిర్మాణాలు మూడో ప్యాకేజీలో, నంద్యాల నుంచి ఆత్మకూరు వరకు రహదారి విస్తరణ పనులను నాలుగు, ఐదు ప్యాకేజీల్లో చేర్చారు. అయితే 1, 4, 5 ప్యాకేజీ పనులు దాదాపుగా తుది దశకు చేరాయి. మూడో ప్యాకేజీ పనుల కోసం త్వరలోనే టెండర్లు పిలవనున్నారు.

ముమ్మరంగా ఫ్లైఓవర్ పనులు

కొల్లాపూర్ సమీపంలో బైపాస్ రహదారి వెంట ఫ్లైఓవర్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. సింగోటం క్రాస్‌రోడ్ వద్ద, ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో పెంట్లవెల్లి రోడ్డు పక్కన పిల్లర్లు నిర్మించారు. పై భాగంలో స్లాబ్ నిర్మాణాలు జరుగుతున్నాయి. ఫ్లైఓవర్ సైడ్ గోడలు ఏర్పాటు చేశారు. చౌటబెట్లకు వెళ్లే దారిలో మూలవాగుపై భారీ కల్వర్టు నిర్మిస్తున్నారు. ఈ ప్రాంతం చౌరస్తాగా రూపుదిద్దుకోనుంది. సోమశిలకు వెళ్లే రోడ్డులో బైపాస్ పనులు తుది దశలో ఉన్నాయి.



చౌటబెట్లకు వెళ్లే దారిలో వాగుపై నిర్మిస్తున్న భారీ కల్వర్టు

నేటినుంచి ఎస్‌ఏ–2 పరీక్షలు



జిల్లాకేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు

- జిల్లాలో 1,06,000 మంది విద్యార్థులు
- అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్న అధికారులు

కందనూలు: జిల్లావ్యాప్తంగా బుధవారం నుంచి విద్యార్థులకు వార్షిక పరీక్షలు (సమ్మెటివ్ అసెస్‌మెంట్–2) నిర్వహించనున్నారు. ఇందుకోసం జిల్లా విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్, కేజీబీవీ, గురుకుల పాఠశాలల్లో 1 నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్షలు రాయనున్నారు. ఇప్పటికే ఆయా ఎమ్మార్సీల నుంచి ప్రశ్నపత్రాలు పాఠశాలలకు చేరుకున్నాయి. జిల్లాలో మొత్తం 1,019 పాఠశాలలు ఉండగా.. వీటిలో 1 నుంచి 9వ తరగతి వరకు తెలుగు, ఆంగ్లం, హిందీ, ఉర్దూ మాధ్యమాల్లో కలిపి 1,06,000 మంది విద్యార్థులు చదువుతున్నారు.

పరీక్షల సమయం ఇలా..

అన్ని తరగతులకు ఉదయం 9 గంటలకు పరీక్షలు ప్రారంభమవుతాయి. 1 నుంచి 7వ తరగతి వరకు 11– 30 గంటల వరకు, 8వ తరగతికి 11.45 గంటల వరకు, 9వ తరగతికి 12 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. ప్రాథమిక విద్యార్థులకు ఈ నెల 11న తెలుగు, 12న ఆంగ్లం, 15న గణితం, 16న పరిసరాల విజ్ఞానం పరీక్షలు కొనసాగుతాయి. 6, 7 తరగతుల వారికి 9న తెలుగు, 10న హిందీ, 11న ఆంగ్లం, 12న సాంఘికశాస్త్రం, 15న జనరల్ సైన్స్, 16న గణితం పరీక్షలు ఉంటాయి. 8, 9 తరగతులకు 9న తెలుగు, 10న హిందీ, 11న ఆంగ్లం, 12న గణితం, 15న భౌతికశాస్త్రం, 16న జీవశాస్త్రం, 17న సాంఘికశాస్త్రం పరీక్షలు రాయనున్నారు. 23న పీటీఎం నిర్వహించి ఫలితాలు వెల్లడించాలని జిల్లా డీసీఈబీ అధికారి రాజశేఖర్‌రావు తెలిపారు.

నల్లగొండకు సాగునీరు తరలించడం అన్యాయం



మాట్లాడుతున్న మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి

కందనూలు: జిల్లాలోని ఏదుల రిజర్వాయర్ నుంచి నల్లగొండ జిల్లాకు అక్రమంగా సాగునీటిని తరలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జీఓను విడుదల చేసిందని, దీనిని అడ్డుకునేందుకు ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎంపీలు ముఖ్యమంత్రిని నిలదీయాలని మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని అధికార పార్టీ నేతలకు ప్రాజెక్టులపై అవగాహన లేదని, ప్రజల కోసం పనిచేయకుండా స్వార్థం కోసం పని చేస్తున్నారని విమర్శించారు. గతంలో తాను మంత్రిగా ఉన్న సమయంలోనే పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్రారంభానికి అన్ని అనుమతులను సాధించడం జరిగిందని, తద్వారా 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు, పలు గ్రామాలకు తాగునీరు అందించేందుకు రూపొందించిన పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నల్లగొండ జిల్లాకు చెందిన ఓ రిటైర్డ్ ఇంజినీర్ ఆడించే ఆటగా పాలకులు పనిచేస్తున్నారని ఎస్‌ఎల్‌బీసీ ద్వారా సాగునీరు అందించవచ్చని, అందుకు సంబంధించి గతంలో ముఖ్యమంత్రి జీఓను కూడా విడుదల చేశారని దానిని పక్కన పెట్టి ఇప్పుడు అధికారంలో ఉన్న ముఖ్యమంత్రి, మంత్రులు ఏదుల రిజర్వాయర్ నుంచి నీటిని తరలించేందుకు చేస్తున్న కుట్రలతో ఉమ్మడి పాలమూరు రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆరోపించారు. సమావేశంలో నాయకులు అర్థం రవి, బాలగౌడ్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

కేజీబీవీలో డీఈఓ విచారణ



కందనూలు: జిల్లాకేంద్రం శివారులోని నాగనూలు కేజీబీవీలో మంగళవారం డీఈఓ రమేష్‌కుమార్ విచారణ చేపట్టారు. వివరాలు ఇలా.. కేజీబీవీలో 9వ తరగతి విద్యార్థిని స్టడీ అవర్స్‌కు ఆలస్యంగా వచ్చిందని మూడు గంటల పాటు నిలబెట్టిన ఓ ఉపాధ్యాయురాలు కనీసం నీళ్లు తాగనివ్వకుండా, బాత్రూం వెళ్లకుండా పనిష్మెంట్ ఇచ్చిందని మనస్తాపంతో చేయి కోసుకుంది. సమాచారం అందుకున్న డీఈఓ రమేష్‌కుమార్ కేజీబీవీ జిల్లా బాలిక అభివృద్ధి అధికారి శోభారాణితో కలిసి పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులతో విచారణ జరిపారు. విద్యార్థులను కలిసి ఉపాధ్యాయురాలి తీరు, విద్యార్థులతో ప్రవర్తిస్తున్న విధానం గురించి తెలుసుకున్నారు. దీనిపై సమగ్ర నివేదిక కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. ముందుగా ఘటనకు కారకురాలైన ఉపాధ్యాయురాలికి షోకాజ్ నోటీస్ జారీ చేశామని, ఉపాధ్యాయురాలి వివరణ అనంతరం పూర్తిస్థాయిలో క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని డీఈఓ చెప్పారు. అయితే ఉపాధ్యాయురాలిని సస్పెండ్ చేయాలని పాఠశాల వద్ద మంగళవారం విద్యార్థి, కుల సంఘాల నాయకులు ఆందోళన చేపట్టారు. పోలీసులు పాఠశాల దగ్గరకు వచ్చి విద్యార్థినికి న్యాయం చేస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

బ్యాంక్ సేవలు గ్రామీణులకు చేరువ చేయాలి



లింగాల: మారుమూల గ్రామీణ ప్రాంతాల ప్రజలకు బ్యాంకు సేవలను మరింత చేరువ చేయాలని ఆర్‌బీఐ లీడ్ జిల్లా అధికారి డిబోజిత్ భౌరా అన్నారు. మంగళవారం లింగాలలోని సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సంస్థ ద్వారా నిర్వహిస్తున్న ఆర్థిక అక్షరాస్యత కేంద్రాన్ని సందర్శించిన ఆయన కేంద్రం నిర్వహణకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు బ్యాంక్ సేవలపై ఏ విధంగా అవగాహన కల్పిస్తున్నారనే విషయాలను తెలుసుకొని.. సూచనలు, సలహాలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న సైబర్ క్రైం మోసాల గురించి ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని కోరారు. ఆర్థిక అక్షరాస్యత కేంద్రం పనితీరును మరింతగా మెరుగుపర్చుకొని సమర్థవంతంగా నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసరావు, యూబీఐ అధికారి లక్ష్మణ్, ఎఫ్‌ఎల్‌సీ శేషయ్య, సీఎఫ్‌ఎల్ కౌన్సిలర్లు ఎండీ మన్సూర్, రూపేష్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

నేడు ఏఐపై జాతీయ సెమినార్

జడ్చర్ల టౌన్: డా.బీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వాణిజ్యశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో బుధవారం ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్(ఏఐ)పై జాతీయ సెమినార్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా.సుకన్య తెలిపారు. మంగళవారం కళాశాలలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. 'వాణిజ్య రంగంలో ఏఐ ప్రభావం' అన్న అంశంపై ఒకరోజు సెమినార్ కొనసాగుతుందని దేశంలోని వివిధ డిగ్రీ కళాశాలల నుంచి సెమినార్ కోసం ఆన్‌లైన్ ద్వారా ఇప్పటికే 130 జనరల్స్ వచ్చాయన్నారు. త్వరలోనే విద్యార్థులకు పాఠ్యాంశంగా తేబోతున్న ఏఐతో విప్లవాత్మక మార్పులు రాబోతున్నాయని అన్నారు. సరైన మార్గంలో వినియోగించుకుంటే ఎన్నో ప్రయోజనాలున్నాయని, దానివల్ల కలిగే అనర్థాలు అదే తరహాలో వివిధ కళాశాలల నుంచి ప్రతినిధులు తమ అభిప్రాయాలను వెల్లడించనున్నారన్నారు. సెమినార్‌కు రాష్ట్ర ఉన్నత విద్య కౌన్సిల్ చైర్మన్ వి.బాలకిష్టారెడ్డి, పీయూ వైస్ చాన్స్‌లర్ జీఎన్ శ్రీనివాస్, సీసీఈ జేడీ జి.యాదగిరి, రాజేందర్‌సింగ్, ఏజీఓ బాల భాస్కర్, ముఖ్యవక్త యలమంచిలి రామకృష్ణ, రీసోర్స్ పర్సన్ డా.కె.రాజ్‌కుమార్ హాజరుకానున్నారని తెలిపారు. వైస్‌ప్రిన్సిపాల్ డా.నర్మద, మీడియా కన్వీనర్ రాఘవేందర్, సభ్యులు సతీష్ పాల్గొన్నారు.

రిజర్వాయర్ భూ సర్వే అడ్డగింత

- సర్వే సిబ్బందితో రైతుల వాగ్వాదం
- మరోసారి వస్తే దాడులు తప్పవని హెచ్చరిక

– బల్మూర్

– వివరాలు 8లో..

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి



మహిళా సమాఖ్య భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్: రాష్ట్ర ప్రభుత్వం మహిళలను అత్యున్నత స్థాయిలో ఉంచేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతుందని, ఇందులో భాగంగా ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళల ఆర్థికాభివృద్ధి, సాధికారత సాధించే విధంగా ప్రోత్సహిస్తుందని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. అందుకు అనుగుణంగా జిల్లా కేంద్రంలో ప్రత్యేకంగా అత్యాధునిక వసతులతో మహిళా సమాఖ్య భవనం నిర్మించనున్నట్లు చెప్పారు. మంగళవారం ఆయన భవన నిర్మాణాన్ని పరిశీలించారు. ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా రూ.5 కోట్ల నిధులతో పట్టణంలోని సర్వే నం.29లో 786 చదరపు మీటర్ల విస్తీర్ణంలో 13 గదులతో నిర్మించనున్న మహిళా సమాఖ్య భవనం, మహిళల శిక్షణ కార్యక్రమాలు, సమావేశాలు, స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలు, కార్యాలయ వినియోగం, సామూహిక చర్చలకు ఉపయోగపడే విధంగా రూపకల్పన చేసినట్లు వివరించారు. మహిళా సమాఖ్య భవనం నిర్మాణం పూర్తయితే గ్రామీణ మహిళలకు మరింత శిక్షణ అవకాశాలు, సామూహిక కార్యాచరణకు వేదికలు, పాలకవర్గాల సమావేశాలు నిర్వహించుకునే అవకాశాలు లభించనున్నాయని చెప్పారు. మహిళల అభివృద్ధికి ఇది ఎంతో దోహదం చేస్తుందని పేర్కొన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ తబితారాణి, పీఆర్‌ఏఈ శివకృష్ణ తదితరులు ఉన్నారు.

నిధుల దుర్వినియోగంపై డీఎస్పీ విచారణ

నాగర్‌కర్నూల్ క్రైం: నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీలో ఏడాది క్రితం రూ.కోటి నిధులు దుర్వినియోగం అయిన ఘటనలో ఇద్దరు ఉద్యోగులు సస్పెండ్ చేశారు. ఈ క్రమంలో మంగళవారం నిధుల దుర్వినియోగానికి సంబంధించి గతంలో పనిచేసిన మున్సిపల్ కమిషనర్‌తోపాటు ఇతర సిబ్బంది విచారణ నిమిత్తం డీఎస్పీ కార్యాలయానికి హాజరయ్యారని తెలిసింది. ఈ విషయమై డీఎస్పీ శ్రీనివాస్ స్పందిస్తూ నిధుల దుర్వినియోగంపై గతంలో నాగర్‌కర్నూల్‌లో పనిచేసిన అధికారులను విచారణకు పిలిచామని, మరోమారు ఈ నెల 27 విచారణ చేస్తామని ఆయన వివరించారు.

కాపు రాలేదని ఆయిల్‌పాం తోటలు తొలగింపు

తిమ్మాజిపేట: ఆయిల్‌పాం తోట సాగు చేసి ఐదేళ్లు గడిచినా కాత రావడం లేదని తిమ్మాజిపేటకు చెందిన ఓ రైతు పంట తొలగించాడు. తోటలు సాగు చేస్తే అధిక లాభాలు పొందవచ్చని అధికారులు చెప్పారని, కానీ, ఐదేళ్లు గడిచినా కనీసం కాత, పూత రాలేదని రైతు నారాయణ ఆరోపించారు. అధికారులు మొక్కలే నాటామన్నారు. ఎన్నో వ్యయ, ప్రయాసాలకు ఓర్చి ఆయిల్‌పాం తోట సాగు చేస్తే.. కాపు రాకపోగా.. పెట్టుబడి కోసం తెచ్చిన అప్పులు మీద పడ్డాయని వాపోయాడు. గత్యంతరం లేకే పంటను తొలగించి మరో పంట వేసుకుంటానని వివరించారు. ఈ విషయమై ఉద్యానవన అధికారి జగన్ స్పందిస్తూ ఆయిల్‌పాం తోటలు కొన్నిసార్లు కాత ఆలస్యమవుతుందని పేర్కొన్నారు. ఒక్కసారి కాత రావడం మొదలైతే 20 ఏళ్ల వరకు దిగుబడి వస్తుందని ఫలితంగా లాభాలు ఆర్జించవచ్చని పేర్కొన్నారు. రైతులెవరూ కూడా తొందరపడి పంటను తొలగించవద్దని సూచించారు.





ఆర్డీఓ కార్యాలయంలో కార్లపై విరిగిపడిన చెట్టుకొమ్మలు

ఈదురు గాలుల బీభత్సం



వరిదేలలో విరిగిన విద్యుత్ స్తంభానికి మరమ్మతు చేస్తున్న సిబ్బంది

కొల్లాపూర్: పట్టణంలో మంగళవారం సాయంత్రం అకాలవర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో భారీగా ఈదురుగాలులు వీచి బీభత్సం సృష్టించాయి. ఈ క్రమంలో పలు చోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. ఆర్డీఓ కార్యాలయంలో చెట్టు కొమ్మలు విరిగి కార్లపై పడటంతో కార్లు స్వల్పంగా దెబ్బతిన్నాయి. ఈదురుగాలుల కారణంగా మామిడితోటల్లో కాయలు రాలాయి. వరిదేల మాసూం బాబా దర్గా ముందు గల హైమాస్ట్ లైట్ విద్యుత్ స్తంభం విరిగి వైర్ల పడింది. సమీపంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారులు వెంటనే మరమ్మతు చేపట్టగా.. కొద్దిసేపు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వర్షం కారణంగా పంటలు, పండ్లతోటలు ఏమైనా దెబ్బతిన్నాయా అనే వివరాలు సేకరిస్తున్నట్లు వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు తెలిపారు.

ముందుస్తు రాయితీ

మున్సిపాలిటీల్లో ఆస్తిపన్ను చెల్లింపులపై అమలు

- 5 శాతం మాఫీతో ఈ నెలాఖరు వరకు గడువు
- పూర్తిగా చెల్లించిన వారికే ఎర్లీబర్డ్ పథకం
- అంతంత మాత్రంగానే 90 శాతం వడ్డీ రాయితీ వసూలు
- నూతన ఆర్థిక సంవత్సరంపై అధికారుల దృష్టి



అచ్చంపేట మున్సిపాలిటీలో ఎర్లీ బర్డ్ స్కీంపై ఏర్పాటు చేసిన బ్యానర్

అచ్చంపేట: జిల్లాలోని మున్సిపాలిటీల్లో ముందుస్తు ఆస్తిపన్ను చెల్లించేందుకు ప్రభుత్వం ఎర్లీబర్డ్ పథకం అమలు చేస్తోంది. ఈ పథకం ద్వారా చెల్లించిన వారికి పన్నుల్లో 5 శాతం రాయితీ కల్పించింది. గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తిపన్ను వసూళ్లు మార్చి నెలాఖరున ముగిశాయి. అయితే 2025– 26 నూతన ఆర్థిక సంవత్సరం ఆరంభంతో ముందస్తు పన్ను చెల్లింపులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. బకాయిలు పేరుకుపోకుండా ముందస్తుగా పన్ను చెల్లింపులను ప్రోత్సహించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. 5 శాతం రాయితీ అందిస్తుండడంతో ప్రజలకు ఈ పథకం ప్రయోజనం చేకూరుస్తుంది. అయితే ఈ నెల 30 వరకు పన్ను చెల్లించే వారికే ఈ పథకం వర్తిస్తుందని మున్సిపల్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే మున్సిపల్ సిబ్బంది వార్డుల వారీగా నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకొనేందుకు ఇంటింటికి తిరిగి ప్రజలకు 5 శాతం రాయితీపై అవగాహన కల్పిస్తున్నారు.

ప్రచారం కల్పిస్తేనే..

ఎర్లీ బర్డ్ పథకానికి సంబంధించి మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఇప్పటి నుంచే ప్రచారం చేపట్టి పన్ను వసూలు చేయాలి. సరైన ప్రచారం లేకపోవడంతో గతేడాది చాలా మందికి ఈ పథకం, రాయితీ విషయం తెలియక పన్నులు చెల్లించలేదు. దీంతో 2024– 25 ఆర్థిక సంవత్సరంలో పన్ను వసూలు మున్సిపల్ అధికారులు, సిబ్బందికి సవాలుగా మారింది. ఈ పథకంపై విస్తృత ప్రచారం కల్పించాలని ఇప్పటికే మున్సిపల్ కమిషనర్లను సీడీఎంఏ అధికారులు ఆదేశించారు. ప్రజలకు అవగాహన కల్పించి ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకునేందుకు ముందుకు వచ్చేలా కృషి చేయాలని సూచించారు. ఈసారి పాత బకాయిలు ఉన్నవారికి సైతం ఈ పథకం వర్తిస్తోంది. పూర్తి బకాయిలు చెల్లించి ఈ ఏడాది పన్ను చెల్లిస్తేనే ఈ పథకానికి అర్హులనే విషయాన్ని ప్రజల్లోకి ఎర్లీబర్డ్ ద్వారా తీసుకెళ్లేందుకు మున్సిపల్ అధికారులు సమాయత్తమయ్యారు. ప్రజలు కూడా ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటే పన్ను బకాయిలు ఉండకుండా, 5 శాతం రాయితీని పొందేందుకు అవకాశం ఉంటుంది.

బకాయిలు ఇలా..

జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో 2024– 25 మార్చి 31 నాటికి పాతబకాయిలు రూ.8.12 కోట్లు వసూలు కావాల్సి ఉంది. ఇందులో నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీలో రూ.1.56 కోట్లు, కల్వకుర్తిలో రూ.4.46 కోట్లు, అచ్చంపేటలో రూ.1.58 కోట్లు, కొల్లాపూర్‌లో రూ.52.80 లక్షల చొప్పున ఉన్నాయి. వీరికి కూడా ఎర్లీబర్డ్ స్కీం వర్తిస్తుండటంతో ఈ ఆర్థిక సంవత్సరంలో మొండి బకాయిలు సైతం వసూళ్లు అవుతాయనే భావిస్తున్నారు.

ఫలితమివ్వని 'వన్‌టైం సెటిల్‌మెంట్'

వందశాతం పన్నుల వసూలే లక్ష్యంగా ప్రభుత్వం వన్‌టైం సెటిల్‌మెంట్ అవకాశాన్ని కల్పించింది. ఇందులో భాగంగా ఆస్తిపన్ను బకాయిల వడ్డీపై 90 శాతం రాయితీ ప్రకటించారు. అయితే ఈ అవకాశం కేవలం నాలుగు రోజులు మాత్రమే ఇవ్వడంతో అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో వసూళ్లపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టలేకపోయారు. గడగడపకూ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించినా ఫలితం లేకపోయింది. ఫలితంగా జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలు ఆస్తిపన్ను వసూలు చేయడంలో లక్ష్యం చేరుకోలేకపోయాయి. గృహ, వాణిజ్య పన్నులు చెల్లించేవారు కొంతమంది మాత్రమే వినియోగించుకున్నారు.

జిల్లాలోని మున్సిపాలిటీల్లో ఈ ఏడాది ఆస్తిపన్ను వివరాలు

మున్సిపాలిటీ	అసెస్‌మెంట్లు	పన్ను డిమాండ్ (రూ.కోట్లలో)
నాగర్‌కర్నూల్	11,028	4.20
కల్వకుర్తి	8,195	2.48
అచ్చంపేట	6,857	2.30
కొల్లాపూర్	6,536	0.90

సద్వినియోగం చేసుకోవాలి



ఎర్లీబర్డ్ స్కీం ఐదు శాతం ఆఫర్ ఈసారి పాత బకాయిదారులకు కూడా వర్తిస్తోంది. మొత్తం బకాయిలు చెల్లించి, 2025– 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్ను ముందస్తు చెల్లించే వారికి అవకాశం ఉంటుంది. ఈ సదావకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకుని ముందుస్తు పన్ను చెల్లించాలి. సకాలంలో పన్నులు చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలి. – యాదయ్య, మున్సిపల్ కమిషనర్, అచ్చంపేట

2025– 26 ఆర్థిక సంవత్సరంలో మున్సిపాలిటీల పన్ను లక్ష్యం రూ.10.29 కోట్లు ఉండగా.. 5 శాతం రాయితీ మినహాయిస్తే.. రూ.9.77 కోట్లు వసూలు కావాల్సి ఉంటుంది.

క్లుప్తంగా

బస్సు, బైక్ ఢీ : ఒకరి దుర్మరణం


ప్రవీణ్‌కుమార్ (ఫైల్)

వెల్దండ: మండలంలోని పెద్దాపూర్ స్టేజీ వద్ద హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై మంగళవారం బస్సు, బైక్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌ఐ కురుమూర్తి తెలిపారు. ఆయన కథనం మేరకు.. రంగారెడ్డి జిల్లా బడంగ్‌పేటకు చెందిన కింగ్లీకార్ ప్రవీణ్ కుమార్(40), అతడి స్నేహితుడు గోపికృష్ణ పెద్దాపూర్‌లో ఉన్న స్వామి గురూజీని కలవడానికి బైక్‌పై వస్తున్నారు. కల్వకుర్తి నుంచి హైదరాబాద్ వెళ్తున్న అచ్చంపేట డిపోకు చెందిన బస్సు పెద్దాపూర్ స్టేజీ వద్ద నిలిచిన బస్సును దాటే క్రమంలో ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ప్రవీణ్‌కుమార్, గోపికృష్ణకు గాయాలు కాగా వెంటనే చికిత్స నిమిత్తం 108 వాహనంలో మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ప్రవీణ్‌కుమార్ మృతిచెందాడు. భార్య అక్షర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ వివరించారు. గోపీకృష్ణ మిఠాయి దుకాణంలో పని చేస్తుండగా.. ప్రవీణ్‌కుమార్ బడంగ్‌పేటలో మటన్ వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించేవాడు.

మహిళ బలవన్మరణం

రాజోళి: కుటుంబ సమస్యలతో ఓ మహిళ పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ జగదీశ్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండల కేంద్రానికి చెందిన కటిక లలితాబాయి (58)కి ఇద్దరు కుమార్తెలు, ముగ్గురు కుమారులు ఉన్నారు. భర్త చంద్రారావు మానసికంగా సక్రమంగా లేకపోవడం, కుమారులకు వివాహాలు కాక పోవడం, వ్యాపారాలు సాగకపోవడంతో మనోవేదనకు గురై సోమవారం రాత్రి పురుగుమందు తాగింది. గుర్తించిన కుటుంబసభ్యులు వెంటనే కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. పెద్ద కుమారుడు కిశోర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


బాలకృష్ణ(ఫైల్)

మదనాపురం: తల్లి గొడ్డలితో దాడి చేయగా గాయపడ్డ కొడుకు చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు సీఐ శివకుమార్ తెలిపారు. వివరాలు.. మండలంలోని అజ్జకొల్లు గ్రామానికి చెందిన కోటకొండ బాలకృష్ణ (35) పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఏడాదిగా బాలకృష్ణ బదులు తల్లి లక్ష్మి పనిచేస్తుంది. ఈ నెల జీతం కుమారుడు ఖాతాలో పడింది. 3వ తేదీన డబ్బులు ఇవ్వమని లక్ష్మి కొడుకును కోరింది. దీంతో తల్లీకొడుకుల మధ్య గొడవ జరిగింది. లక్ష్మి గొడ్డలితో కొడుకుపై దాడి చేసింది. చిన్నకుమారుడు రవి హుటాహుటిన బాలకృష్ణను వనపర్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్య కోసం గాంధీ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఖిల్లాఘనపురంలో బాలిక..

ఖిల్లాఘనపురం: మండల కేంద్రానికి చెందిన సుష్మ(10) చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్‌ఐ సురేశ్‌గౌడ్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. గ్రామానికి చెందిన అక్కి శ్రీశైలంకు సుష్మ (10), నిశిత కుమార్తెలు. వీరిద్దరు ఈ నెల 6న గొర్రెలు మేపుతుండగా.. సుష్మ అకస్మాత్తుగా కూలి పడి నోటిలో నుంచి నురగ వచ్చింది. గుర్తించిన నిశిత వెంటనే తండ్రికి సమాచారం ఇచ్చింది. ఆయన వెంటనే మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి అటు నుంచి మహబూబ్‌నగర్, హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందింది. విష పురుగు కరిచి తమ కుమార్తె మృతి చెందిందని తండ్రి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

గుర్తుతెలియని జంతువు దాడిలో ఆవు మృతి

ధరూరు : మండలంలోని మార్లబీడుకి చెందిన రైతు బాయిదొడ్డి రాజుకు చెందిన ఆవుపై ఓ గుర్తు తెలియని జంతువు దాడి చేయగా మృతిచెందింది. బాధితుడు తెలిపిన వివరాలు.. మార్లబీడుకి చెందిన రైతు బాయిదొడ్డి రాజు పొలం ధరూరు గట్టు శివారులో ఉంటుంది. పశువులను అక్కడే కట్టేసిన రైతు మంగళవారం ఉదయం పొలం వద్దకు వెళ్లి చూడగా.. ఆవు గొంతు భాగం రక్తగాయాలతో కనిపించింది. దీంతో రైతు అటవీ శాఖాధికారులకు సమాచారం అందించగా వారు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొనఊపిరితో ఉన్న ఆవు మధ్యాహ్నం మృతిచెందింది. బాధిత రైతును ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని రైతులు రాఘవేంద్ర, మార్లబీడు గ్రామస్తులు కోరారు.

46 రోజులుగా శ్రమిస్తున్నారు..


సొరంగం లోపల సహాయక చర్యలు చేపడుతున్న సిబ్బంది

- మరోసారి కన్వేయర్ బెల్టు పొడిగింపు పనులు ప్రారంభం
- ఈ నెల 16 వరకు 70 మీటర్ల శిథిలాలు తొలగించేలా ముందుకు..
- ఎస్‌ఎల్‌బీసీలో ముమ్మరంగా సహాయక చర్యలు

అచ్చంపేట: శ్రీశైలం ఎడమగట్టు కాల్వ (ఎస్‌ఎల్‌బీసీ) సొరంగం లోపల సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. సొరంగం పైకప్పు కూలిన ఘటన జరిగి మంగళవారం నాటికి 46 రోజులు గడవగా.. సొరంగం లోపల మట్టి, బురద, రాళ్లు, టీబీఎం బాగాల తొలగింపు పనులు వేగవంతమయ్యాయి. అలాగే ఎప్పటికప్పుడు వెంటిలేషన్ పనులు చేపడుతున్నారు. మంగళవారం రాత్రి షిఫ్ట్‌కు వెళ్లిన సహాయక సిబ్బంది కన్వేయర్ బెల్టు పొడిగింపు పనులు చేపడుతున్నారు. ప్రస్తుతం 13.730 కి.మీ., వరకు కన్వేయర్ బెల్టు ఉండగా మరో 70 మీటర్ల మేర దీనిని పొడిగించనున్నారు. ఈ నెల 11 వరకు నాలుగు రోజుల పాటు కన్వేయర్ బెల్టు పొడిగింపు పనులు కొనసాగనుండగా.. ఈ సమయంలో మట్టి, బురద బయటకు తరలించడం సాధ్యం కాదు. కన్వేయర్ బెల్టు పొడిగింపు ఇదే చివరి అవకాశంగా అధికారులు చెబుతున్నారు. తొలగించిన టీబీఎం బాగాలు, రాళ్లు, శిథిలాలను లోకో ట్రైన్ ప్లాట్‌ఫాం ద్వారా బయటకు తరలిస్తారు. మిగిలిన 70 మీటర్ల వరకు ఉన్న శిథిలాలను ఈ నెల 16 వరకు పూర్తి చేయాలనే లక్ష్యంతో సహాయక బృందాలు చర్యలు చేపడుతున్నాయి. సొరంగం పైకప్పు కూలిన 13.938 కి.మీ., ప్రదేశం అత్యంత ప్రమాదకరమైనదిగా నిర్ధారించి 45 మీటర్ల వరకు కంచె ఏర్పాటు చేశారు. అక్కడ తవ్వకాలు చేపట్టే అవకాశం లేకపోవడంతో మిగిలిన 70 మీటర్ల వరకు ఉన్న మట్టి, బురద, రాళ్లు, టీబీఎం బాగాలను తొలగించే ప్రక్రియ కొనసాగిస్తున్నారు.

వెంటిలేషన్ కొనసాగింపు..

సొరంగం లోపల మట్టి తవ్వకాలకు అనుగుణంగా వెంటిలేషన్ పనులు కొనసాగిస్తున్నారని ప్రత్యేకాధికారి శివశంకర్ లోతేటి అన్నారు. మంగళవారం ఎస్‌ఎల్‌బీసీ సొరంగం వద్ద జేపీ కార్యాలయంలో సహాయక బృందాల ఉన్నతాధికారులతో సమీక్షా నిర్వహించి సహాయక చర్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాద ప్రదేశంలో ఎలాంటి చర్యలు చేపట్టకుండా మిగిలిన ప్రదేశంలో సహాయక చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ఐదు ఎస్కవేటర్ల సహాయంతో మట్టి తవ్వకాలు చేపడుతూ కన్వేయర్ బెల్టు ద్వారా మట్టి బయటకు తరలిస్తున్నామని చెప్పారు. సొరంగంలో నిరంతరాయంగా వస్తున్న నీటి ఊటను అత్యధిక సామర్థ్యం కలిగిన పంపుల ద్వారా బయటకు పంపింగ్ చేస్తున్నామన్నారు.

కనులపండువగా పూల రథోత్సవం


సిర్సనగండ్ల దేవాలయ ఆవరణలో పూలతేరు లాగుతున్న భక్తులు

- అర్చకుల ప్రత్యేక పూజలు
- పోటెత్తిన భక్తులు

చారకొండ: మండలంలోని సిర్సనగండ్ల సీతారామ చంద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం తెల్లవారుజామునా పూల రథోత్సవం (చిన్నతేరు) కనులపండువగా సాగింది. ఆలయ చైర్మన్ రామశర్మ, ఈఓ అంజనేయులు, మేనేజర్ నిరంజన్ అర్చకులు, ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, భక్తులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతకు ముందు ఉత్సవ విగ్రహాలకు అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. గుట్టపై దత్తాత్రేయ గుడి, ముక్కిండి పోచమ్మ, మైసమ్మ దేవాలయాలను దర్శించుకొని నైవేద్యం సమర్పించారు. మేళతాళాలు, భజనలు, భక్తుల శ్రీరామనామస్మరణతో రథం ముందుకు సాగింది. రథోత్సవానికి భక్తులు పోటెత్తారు. మంగళవారం స్వామివారి దర్శనం అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు క్యూలైన్‌ద్వార స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమాల్లో ఆలయ అర్చకులు మురళిధర్ శర్మ, లక్ష్మణ్ శర్మ, వేణు శర్మ, ఆనంద్ శర్మ, గోపి శర్మ, భాస్కర్ శర్మ, ప్రవీణ్ శర్మ భక్తులు పాల్గొన్నారు.


క్యూలైన్లలో భక్తులు

నేటి రాత్రి పెద్ద రథోత్సవం

బుధవారం అర్ధరాత్రి దాటాక పెద్ద రథోత్సవం ప్రారంభమవుతుందని భక్తులు అధిక సంఖ్యలో హాజరై రథోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆలయ చైర్మన్ దేరం రామశర్మ, ఆలయ ఈఓ అంజనేయులు తెలిపారు.

వంట గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): పెంచిన వంట గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని భారత మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి పద్మావతి డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఓ వైపు నిత్యావసరాల ధరలు పెరిగి సామాన్యుడు బతకలేని స్థాయిలో ఉంటే మరో వైపు గ్యాస్ ధరలు పెంచడం ఏమిటని ప్రశ్నించారు. పేదలకు అందించే ఉజ్వల గ్యాస్ సిలిండర్‌పై కూడా రూ.50 పెంపు మోయలేని భారమేనన్నారు. అంబానీ, అదానీలకు ఆదాయం కట్టబెట్టడానికే ధరల పెంపని తేట తెల్లమవుతుందని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా క్రూడాయిల్ ధరలు పడిపోతే.. దేశంలో మాత్రమే పెరిగిందని సాకు చూపుతూ ధరల పెంపు ఏ మాత్రం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో వనపర్తి జిల్లా కార్యదర్శి గీత, కమిటీ సభ్యులు మాధవి, సత్యమ్మ, సింధు, పద్మ, మహిళలు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న మహిళా సమాఖ్య సభ్యులు

రెట్టింపు లాభాలొచ్చే పరిశోధనలు రావాలి

- నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్
- దక్షిణ తెలంగాణలో పప్పు దినుసులు, నూనెగింజల సాగు అధికం: పీజేటీఏయూ పరిశోధన సంచాలకులు డా.ఎం.బలరాం

బిజినేపల్లి : వ్యవసాయ శాస్త్రవేత్తలు తమ పరిశోధనల ద్వారా రైతులకు రెట్టింపు లాభాలు అందించేలా పరిశోధనలు చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. మంగళవారం పాలెం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సంస్థలో దక్షిణ తెలంగాణ మండల వ్యవసాయ పరిశోధనలు, విస్తరణ సలహా సంఘం చర్చా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడారు. పరిశోధనల ద్వారా సత్ఫలితాలిచ్చిన మేలు రకం పంటలను రైతులకు అందించాలని, సరైన యాజమాన్య పద్ధతులను వారికి సకాలంలో వివరించి దిగుబడులు పెంచాలన్నారు. వాణిజ్య పంటలనే కాకుండా ధాన్యం పంటలను రైతులు సాగు చేసేలా చూడాలన్నారు. పీజేటీఏయూ పరిశోధన సంచాలకులు డా.ఎం.బలరాం మాట్లాడుతూ దక్షిణ తెలంగాణ ప్రాంతంలో ఆహార పంటలు, పప్పు దినుసులు, నూనెగింజల పంటలు అధికంగా పండిస్తారని అన్నారు. గత సంవత్సరం సాగులో ఎదురైన సమస్యలను దృష్టిలో ఉంచుకొని వ్యవసాయ విశ్వవిద్యాలయం అధిక దిగుబడుల్ని, చీడపీడలను తట్టుకునే వంగడాలను సృష్టించాలన్నారు. స్వల్పకాల పరిమితి రకాలను వృద్ధి చేయాలన్నారు. విస్తరణ సంచాలకులు డా.యం.యాకాద్రి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో వస్తున్న మార్పులకు అనుగుణంగా సాంకేతిక పద్ధతులను, సమాచారాన్ని వివిధ రకాల వినూత్న కార్యక్రమాలను చేపడుతూ రైతులకు సమయానుసారంగా వివరించాలన్నారు. కార్యక్రమంలో పాలెం ఆర్‌ఏఆర్‌ఎస్ ఏడీఆర్ డా.సుధాకర్, శాస్త్రవేత్తలు సూచరిత, రామాంజనేయులు, ప్రభాకర్‌రెడ్డి, వ్యవసాయశాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగర్‌కర్నూల్ కలెక్టర్ బాదావత్ సంతోష్

డీఆర్ డిపోలకు పూర్వ వైభవం తెస్తాం


జీసీసీ చైర్మన్ తిరుపతిని సన్మానిస్తున్న నాయకులు

మన్ననూర్: రాష్ట్రంలోని గిరిజన కోఆపరేటివ్ సంస్థల (జీసీసీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డీఆర్ డిపోలకు పూర్వ వైభవం తీసుకువస్తామని సంస్థ రాష్ట్ర చైర్మన్ కొట్నావత్ తిరుపతి అన్నారు. మంగళవారం మన్ననూర్‌లోని జీసీసీ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన అక్కడి పరిస్థితులను జీసీసీ మేనేజర్ సంతోష్‌కుమార్, చెంచు సంఘాల నాయకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గిరిజన సంఘాలు, కాంగ్రెస్ పార్టీ నాయకులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ఈ ప్రాంతంలోని చెంచులు కనీస జీవనోపాదులు లేక తీవ్ర ఇబ్బందులతో జీవనం కొనసాగిస్తున్నారన్నారు. గతంలో జీసీసీ ఈ ప్రాంతంతోపాటు పరిసర జిల్లాల్లో కూడా ఎంతో ప్రాధాన్యతలో కార్యక్రమాలు ఉండేవని వివరించారు. కొంతకాలంగా అటవీ ఉత్పత్తులు లేక చెంచులు జీవనోపాధి కోల్పోయి ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి హామీ పథకం, ఇతర ఉచిత పథకాలపై ఆధారపడి జీవనం గడుపుతున్నారని వాపోయారు. దక్షిణ తెలంగాణ అమరనాథ్ యాత్రగా చెప్పుకునే సలేశ్వరం ఉత్సవాలను కనీసం 5 రోజులు నిర్వహించుకునే విధంగా అవకాశం కల్పించాలని స్థానికులు కోరారు. అదేవిధంగా సంస్థలో ఉద్యోగాలు చేసి పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు రావాల్సిన బెనిఫిట్స్ త్వరగా ఇప్పించాలని రిటైర్డ్ ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. అనంతరం చెంచు సేవా సంఘం నాయకులు శంకరయ్య, రాజేంద్రప్రసాద్, కాంగ్రెస్ నాయకులు ఎంఏ రహీం, వెంకటరమణ, గోపాల్‌నాయక్ శాలువా, పూలబొకెతో ఆయనను ఘనంగా సన్మానించారు.

ఊర చెరువులో మొసలి



వీపనగండ్ల: మండల కేంద్రం సమీపంలో ఉన్న ఊరచెరువులో మొసలి సంచరిస్తుండటంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. తరచూ బయటకు వస్తుండటంతో అటువైపు వెళ్లేందుకు జంకుతున్నారు. అధికారులు స్పందించి చెరువు నుంచి తరలించడంతో పాటు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

కారులో మంటలు



గద్వాల క్రైం: ప్రమాదవశాత్తు కారులో మంటలు చెలరేగిన ఘటన మంగళవారం ఉదయం పట్టణంలో చోటు చేసుకుంది. ఫైర్ సిబ్బంది, బాధితుడి కథనం మేరకు.. పట్టణంలోని వీవర్స్‌కాలనీకి చెందిన కిరణ్‌కుమార్‌రెడ్డి ఉదయం కారును బయటకు తీసే క్రమంలో ఇంజిన్ నుంచి మంటలు వచ్చాయి. గుర్తించిన యజమాని మంటలను అదుపు చేసేందుకు యత్నించినా ఫలితం లేకపోవడంతో అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. దీంతో ఘటనస్థలికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. షార్ట్‌సర్క్యూట్‌తోనే ప్రమాదం జరిగి ఉండొచ్చని ఫైర్‌సిబ్బంది తెలిపారు.

రిజర్వాయర్ భూసర్వేను అడ్డుకున్న రైతులు


భూ సర్వేను నిలిపి వేయాలని రోడ్డుపై నిరసన తెలుపుతున్న రైతులు

- సర్వే సిబ్బందితో వాగ్వాదం
- మరో సర్వేకు వస్తే దాడులు తప్పవు: రైతులు

బల్మూర్: మండలంలోని బల్మూర్ సమీపంలో నిర్మించనున్న ఉమామహేశ్వర ప్రాజెక్టు సర్వే పనులను మంగళవారం రైతులు అడ్డుకున్నారు. రైతుల అభిప్రాయ సేకరణ లేకుండా తమకు నష్టం కలిగించే ప్రాజెక్టుపై ఏడాదిగా పోరాటం చేస్తున్న తమతో అధికారులు, ప్రజాప్రతినిధులు ఏమాత్రం చర్చించకుండా పరిహారాలు ఇవ్వకుండానే భూసర్వే చేయడం ఏమిటని వారు సర్వే సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. ఈసందర్భంగా మైలారం–అంబగిరి రోడ్డుపై నిరసన తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణంపై కోర్టులో కేసు ఉన్న కూడా నిబంధనలు పాటించకుండా సర్వే చేయడంపై రైతులు మండిపడ్డారు. గతంలో రెండు సార్లు సర్వే పనులను అడ్డుకున్నా మళ్లీ సర్వే చేయడం తగదని, మరోసారి సర్వేకు వస్తే దాడులు తప్పవని రైతులు సర్వే సిబ్బందిని హెచ్చరించారు. దీంతో సర్వే సిబ్బంది వెనుదిరిగారు. కార్యక్రమంలో రైతు నాయకులు తిరుపతయ్య, శివశంకర్, కృష్ణయ్య, రాజేష్, కాగుల మల్లయ్య, శ్రీశైలం,తో పాటు బల్మూర్, అనంతవరం గ్రామానికి చెందిన భూనిర్వాసిత రైతులు పాల్గొన్నారు.

పంటకు పురుగు మందు కొట్టి.. రైతు మృతి

నవాబుపేట: పంటకు పురుగు మందు కొట్టిన అస్వస్థతకు గురైన ఓ రైతు మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. మండలంలోని లోకిరేవు గ్రామానికి చెందిన రైతు కావలి సత్తయ్య(46) ఈ నెల 3న తన పొలంలో పంటకు పురుగు మందు పిచికారీ చేశాడు. రోజంతా పురుగు మందు కొట్టి అస్వస్థతకు గురై పొలం చెంతనే పడిపోయాడు. దీంతో చుట్టుపక్కల రైతులు గమనించి కుటుంబ సభ్యులతో కలిసి 108 వాహనంలో జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొంది కోలుకోవడంతో 5న ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యి ఇంటికి వచ్చాడు. అయితే మరుసటి రోజు మరోసారి అనారోగ్యానికి గురవడంతో ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. ఈ ఘటనపై సత్తయ్య కుమారుడు ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు.

వ్యక్తి మృతదేహం లభ్యం

అలంపూర్: పట్టణంలోని వంతెన సమీపంలో తుంగభద్ర నది ఒడ్డున నంద్యాల జిల్లా బనగానపల్లికి చెందిన ఆదిత్య శశాంక్ (33) మృతదేహం మంగళవారం లభ్యమైందని ఎస్‌ఐ వెంకటస్వామి తెలిపారు. స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో ఘటనాస్థలానికి చేరుకొని పరిశీలించామన్నారు. తల్లి అనాథ శరణాలయంలో ఉందని.. ఇద్దరు అక్కలు ఉపాధ్యాయులుగా విధులు నిర్వర్తిస్తున్నారని చెప్పారు. ఘటన స్థలాన్ని సీఐ రవిబాబు పరిశీలించారు.

పునరావాస పనుల్లో వేగం పెంచాలి

- అడ్డంగా ఉన్న స్తంభాలను వేరేచోటికి మార్చండి
- మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఉదండాపూర్ నిర్వాసితుల పునరావాస పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రెవెన్యూ, ఇరిగేషన్, సర్వే ల్యాండ్ రికార్డ్స్, సంబంధిత అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉదండాపూర్ రిజర్వాయర్ కింద వల్లూరు, ఉదండాపూర్, తుమ్మలకుంటతండా, రేగడిపట్టితండా, చిన్నగుట్టతండా, శామగడ్డ తండా, ఒంటిగుడిసెతండా, పోలేపల్లి వ్యవసాయ క్షేత్రంలో ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు, అవార్డు అందుకున్న వారందరికీ పునరావాసం కింద 300 గజాల స్థలం, ప్రైమరీ హెల్త్‌సెంటర్, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, వెటర్నరీ హాస్పిటల్, కమ్యూనిటీ హాల్స్, పార్కులను త్వరితగతిన పూర్తయ్యేలా చేపట్టాలనిఅధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ వాటర్ పైపులైన్లు ఇచ్చిన గడువులోగా త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని, రోడ్లు, డ్రెయినేజీలు, సోక్ పిట్స్, ఎలక్ట్రిసిటీ మిగిలిన వాటిని త్వరగా పూర్తి చేయాలని అన్నారు. ప్లాట్లకు అడ్డుగా వున్న ఎలక్ట్రిసిటీ స్తంభాలను వేరే చోటికి మార్చాలన్నారు. నిర్వాసితులు దేవాలయానికి స్థలం కేటాయించవలసిందిగా కోరినారని, ముందుగా అనుకున్న సబ్ స్టేషన్ స్థానంలో దేవాలయానికి కేటాయించి, సబ్ స్టేషన్‌ను వేరే ప్రాంతానికి మార్చాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నిర్వాసితులకు స్థలం కేటాయించేందుకు సరిపోకపోతే సర్వే చేసి ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి వెంటనే ప్రపోజల్స్ పంపించాలని ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ మోహన్‌రావు, స్పెషల్ కలెక్టర్ మధుసూదన్ నాయక్, ఆర్డీఓ నవీన్, పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యంతో మహిళ మృతి

- ఆగ్రహించిన కుటుంబసభ్యులు..
- ఆస్పత్రి నిర్వాహకులపై దాడి

మహబూబ్‌నగర్ క్రైం: గుండె సమస్యతో ఆస్పత్రికి వచ్చిన మహిళ వైద్యుల నిర్లక్ష్యంగా మృతి చెందిందని ఆగ్రహించిన మృతురాలి కుటుంబసభ్యులు, బంధువులు ఆందోళన చేయడంతో పాటు ఆస్పత్రి నిర్వాహకులపై దాడి చేశారు. జిల్లాకేంద్రంలో ఉన్న ఓ కార్డియాలజీ ప్రైవేట్ ఆస్పత్రిలో నవాబ్‌పేట మండలపరిధిలోని ఓ తండాకు చెందిన 45 ఏళ్ల మహిళ గుండెకు సంబంధించిన సమస్యతో అడ్మిట్ అయ్యారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఆమె మృతి చెందింది. దీంతో ఆగ్రహించిన కుటుంబసభ్యులు వైద్యుల నిర్లక్ష్యం వల్లే చనిపోయినట్లు ఆరోపిస్తూ ఆస్పత్రిలో ఆందోళనకు దిగారు. తండా నుంచి యువకులు భారీగా ఆస్పత్రికి తరలిరావడంతో అక్కడ ఉద్రిక్తంగా మారింది. ఆస్పత్రి సిబ్బందికి, బాధిత కుటుంబసభ్యులకు గొడవ ముదరడంతో అక్కడ పని చేసే వైద్యుడితో పాటు నిర్వాహకులు, ఇతర సిబ్బందిపై దాడికి పాల్పడినట్లు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. ఈ వ్యవహారంలో బాధితులు ఎలాంటి ఫిర్యాదు ఇవ్వలేదని టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీ.. వ్యక్తి దుర్మరణం

నందిగామ: గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా నందిగామ మండల పరిధిలోని రంగాపూర్ శివారులోబైపాస్ రోడ్డుపై సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ ప్రసాద్ తెలిపిన ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లకు చెందిన అంజనేయులు(48) భిక్షాటనతో పాటు ప్లాస్టిక్ కవర్లు, కాగితాలు సేకరించి అమ్ముకొంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో 44వ నంబరు జాతీయ రహదారిపై రంగాపూర్ శివారులోని ఓ పెట్రోల్ పంపు సమీపంలో రోడ్డుపై వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అంజనేయులు తీవ్రగాయాలకు గురయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలికి చేరుకొని క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. కాగా అప్పటికే అంజనేయులు మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదం జరిగిన తర్వాత స్థానికులు 108కు కాల్ చేస్తే అంబులెన్స్ వాహనం సకాలంలో రాలేదని.. లేదంటే తన భర్త బతికేవారని మృతుడి భార్య ఆరోపించారు.

జోరుగా ఉల్లి విక్రయాలు


అమ్మకానికి సిద్ధం చేసిన ఉల్లి బస్తాలు

- క్వింటా గరిష్టంగా రూ.1,800..
- కనిష్టంగా రూ.1,200

దేవరకద్ర: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం ఉల్లి విక్రయాలు జోరుగా సాగాయి. బుధవారం ఈశ్వర వీరప్పయ్యస్వామి రథోత్సవం ఉండటంతో మార్కెట్‌కు సెలవు ప్రకటించగా.. ఒకరోజు ముందుగానే ఉల్లి వేలం నిర్వహించారు. సుమారు మూడు వేల బస్తాల ఉల్లి మార్కెట్‌కు రాగా.. నాణ్యమైన ఉల్లి ఎక్కడ ఉంటే అక్కడ కొనుగోలుదారుల సందడి కనిపించింది. ఇతర మార్కెట్ల నుంచి వచ్చిన వ్యాపారులు కూడా ఉల్లిని తక్కువ మొత్తంలోనే కొనుగోలు చేశారు.

నిలకడగా ధరలు..

మంగళవారం జరిగిన వేలంలో ఉల్లి ధరలు నిలకడగానే ఉన్నాయి. ఉదయం 10 గంటలకే వేలం ప్రారంభం కాగా క్వింటా గరిష్టంగా రూ.1,800.. కనిష్టంగా రూ.1,200 ధర పలికింది. మార్కెట్ నిబంధనలు సడలించిన తర్వాత బస్తా 50 కిలోలుగా నిర్ణయించారు. బస్తా ధర గరిష్టంగా రూ.900.. కనిష్టంగా రూ.600 వరకు విక్రయించారు.

తండ్రిపై కొడుకు దాడి

నవాబుపేట: కన్నతండ్రినే ఓ కొడుకు దాడి చేయగా కూతురు అడ్డుకొని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు. వివరాలు.. మండలంలోని కాకర్లపహాడ్‌కి చెందిన గుండు బాలయ్యను అతని కుమారుడు గుండు మోగులయ్య మంగళవారం మద్యం మత్తులో అకారణంగా దాడి చేశాడు. అప్పుడే వచ్చిన బాలయ్య కుమార్తె మైబమ్మ నిలువరించేందుకు ప్రయత్నించింది. ఆమెపై సైతం దాడి చేశాడు. దీంతో మైబమ్మ ఫిర్యాదుతో మోగులయ్యపై కేసు నమోదు చేశామన్నారు.

క్లుప్తంగా

అపోహలు వద్దు

కల్వకుర్తి రూరల్: ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా సరఫరా చేస్తున్న సన్న బియ్యంపై అపోహలు వద్దని తహసీల్దార్ ఇబ్రహీం సూచించారు. మంగళవారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రేషన్ కార్డు దారులకు ప్రభుత్వం నాణ్యమైన సన్నబియ్యం అందిస్తోందన్నారు. పేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎంగంపల్లితండాలో బోరు డ్రిల్లింగ్



పెంట్లవెల్లి: మండలంలోని ఎంగంపల్లి తండాలో మంగళవారం బోరు డ్రిల్లింగ్ చేశారు. ఇటీవల తండాలో నెలకొన్న తాగునీటి సమస్యను తండావాసులు మంత్రి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే ఆయన స్పందించి సొంత ఖర్చులతో బోరు డ్రిల్లింగ్ చేయించారు. పుష్కలంగా నీరు రావడంతో తండావాసులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. మాజీ సర్పంచ్ గోపినాయక్, ఎంపీడీఓ దేవేందర్ గ్రామంలోని బోర్ పంపు బిగించి ప్రారంభించారు. గోపినాయక్, ఎంపీడీఓ దేవేందర్, పంచాయతీ సెక్రెటరీ దామోదర్‌గౌడ్, కృష్ణ, సిద్ధు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన



నాగర్‌కర్నూల్ క్రైం: ఈనెల 6న హైదరాబాద్‌లో న్యాయవాది మహ్మద్ ముజతబా అలీపై కత్తితో దాడికి పాల్పడాన్ని నిరసిస్తూ మంగళవారం జిల్లా కేంద్రంలోని కోర్టు ఎదుట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవికాంతరావు మాట్లాడుతూ న్యాయవాదులకు రక్షణ కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు మధుసూదన్‌రావు, శ్యాంప్రసాద్‌రావు పాల్గొన్నారు.

బహుమతులు అందజేత



బల్మూర్: మండలంలోని మహాదేవ్‌పూర్‌లో నిర్వహించిన అచ్చంపేట డివిజన్ స్థాయి క్రికెట్ టోర్నీ పోటీలలో మంగళవారం నిర్వహించిన ఫైనల్స్‌లో రమేష్ రాయల్స్(మహాదేవ్‌పూర్) జట్టు ప్రథమ బహుమతి గెలుపొందింది. గత నెల 26 నుంచి 13 రోజుల పాటు సాగిన పోటీలలో 7 జట్లు తలపడ్డాయి. ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు గ్రామానికి చెందిన సునీల్‌కుమార్‌రెడ్డి నగదు రూ.60వేలు(ప్రథమ), ద్వితీయస్థానంలో నిలిచిన జట్టుకు రూ.40 వేలు నగదును సమకూర్చారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ తనయుడు డా.యశ్వంత్ క్రీడాకారులకు నగదుతో పాటు షీల్డ్‌లను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షుడు గిరివర్ధన్‌గౌడ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రీడలతో దేహదారుఢ్యం



తెలకపల్లి: క్రీడలతో దేహదారుఢ్యం పెంపొందుతుందని ఎస్‌ఐ నరేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సీఎల్‌ఆర్ విద్యా సంస్థ మాజీ డైరెక్టర్ వుంద్యాల నరేందర్‌రెడ్డి స్మారకార్థం ఏర్పాటుచేసిన మండల స్థాయి బాడ్మింటన్ పోటీలను ఆయన ప్రారంభించారు. సింగిల్‌విండో డైరెక్టర్ రాజ మహేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజేందర్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే రాష్ట్రాభివృద్ధి

అచ్చంపేట రూరల్: బీజేపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు అన్నారు. మంగళవారం పట్టణంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు గండు శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన పార్టీ క్రియాశీల సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మంగ్యానాయక్, బాలాజీ, శ్రీనునాయక్, రాంచంద్రయ్య, రవీందర్, తేజస్విని, చందులాల్, శివచంద్ర, రేణయ్య, అభి పాల్గొన్నారు.



రైతులను ప్రోత్సహిస్తాం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు



సీనియర్ విభాగంలో బండ లాగుతున్న ఎద్దులు

ఉప్పునుంతల: మండలకేంద్రంలో కేదారేశ్వర చెన్నకేశవ స్వామి ఆలయంలో శ్రీరామ నవమిని పురస్కరించుకొని నిర్వహించిన బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం సీనియర్ విభాగంలో అంతర్రాష్ట్ర ఎద్దుల బండలాగుడు పోటీలకు విశేష స్పందన లభించింది. ఆయా ప్రాంతాల నుంచి 8 జతల ఎద్దులు పాల్గొన్నాయి. వరుసగా ఐదు స్థానాల్లో నిలిచిన ఎద్దుల జతలకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి రూ. 60 వేలు నగదును హైదరాబాద్‌కు చెందిన ఆర్ఆర్ బుల్స్ గెలుచుకున్నాయి. చీమర్ల వారి కుటుంబం సభ్యులు బహుమతిని అందజేశారు. ఆ తర్వాత టీసీఆర్ బుల్స్, కర్నూలు జిల్లాకు చెందిన దాసు, పెద్దదగడకు చెందిన గోపాలకృష్ణ, ఆర్ఆర్ బుల్స్ వరుసగా రెండు, మూడు, నాలుగు, ఐదు స్థానాల్లో నిలిచాయి. ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తోందని, ఇలాంటి పోటీల ద్వారా రైతుల మధ్య స్నేహభావం పెంపొందుతుందని ఎమ్మెల్యే వంశీకృష్ణ తనయుడు చిక్కుడు యశ్వంత్ అన్నారు.

జూనియర్ విభాగానికి సంబంధించి హుజూర్‌నగర్‌కు చెందిన జేవీఎల్ బుల్స్‌కు మొదటి బహుమతిని రూ. 50 వేలు కట్టా కొండల్‌రెడ్డి అందజేశారు. మల్లకల్‌కు గ్రామస్తుడు జయమ్మ వీరాంజనేయులుకు చెందిన ఎద్దుల జత ద్వితీయ బహుమతి రూ. 40వేలు, సుధాకర్‌రెడ్డి ఎద్దుల జతకు ఎద్దుల జతకు మూడో బహుమతి రూ. 30 వేలు, తెనాలికి చెందిన రామారావు ఎద్దుల జతకు నాల్గో బహుమతి రూ. 20 వేలు, తెనాలికి చెందిన బత్తుల చిన్నాబ్బాయి ఎద్దుల జతకు ఐదో బహుమతి రూ. 10 వేలు అందజేశారు. కోలాటం, ట్రాక్టర్ రివర్స్, భజన, అడుగుల భజన పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరెడ్డి, నర్సింహారెడ్డి నారాయణ రెడ్డి ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య



విద్యార్థులతో ఎంఈఓ బషీర్ అహ్మద్

లింగాల: ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుందని మండల విద్యాధికారి బషీర్ అహ్మద్ అన్నారు. మంగళవారం మండలంలోని లింగాల, అంబట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో 'ట్వినింగ్ ప్రోగ్రామ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. 5, 7 తరగతులు పూర్తి చేసిన విద్యార్థులు పై చదువులకు వెళ్లుటకు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు వారిలో అవగాహనను కల్పించారు. లింగాల ఉన్నత పాఠశాలలో అప్పాయపల్లి, చెన్నంపల్లి, అదేవిధంగా అంబట్‌పల్లి ఉన్నత పాఠశాలకు కోమటికుంట ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులను తీసుకెళ్లి ప్రభుత్వం పాఠశాలలో ఉండే సౌకర్యాలపై అవగాహన కల్పించారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే భోదన జరుగుతుందని, కంప్యూటర్లు, ల్యాబ్ సౌకర్యాలు ఉంటాయని, డిజిటల్ బోధన చేయడం జరుగుతుందనే క్షేత్రస్థాయిలో వివరించారు. వచ్చే విద్యా సంవత్సరంలో పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచుటకు ఈ ప్రోగ్రామ్ దోహద పడుతుందని ఎంఈఓ పేర్కొన్నారు. అంబట్‌పల్లి జీహెచ్‌ఎం జ్యోతిరాణి, హెచ్‌ఎంలు శ్రీనివాస్‌రెడ్డి, అరవింద్, పర్వతాలు, సుశీలమ్మ, సీఆర్‌పీలు హరిలాల్, విష్ణు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిప్పంటుకొని మొక్కలు దగ్ధం



వెల్దండ: మండల కేంద్రంలోని హైదరాబాదు–శ్రీశైలం జాతీయ రహదారికి ఇరుపువైపులా గత ప్రభుత్వం హయాంలో నాటిన హరితహార మొక్కలకు మంగళవారం ప్రమాదవశాత్తు నిప్పంటుకుంది. దీంతో మొక్కలు పూర్తిగా కాలిపోయాయి. అధికారులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు ఘటన స్థలానికి చేరుకొని మంటలు ఆర్పారు. ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి మాట్లాడుతూ వెల్దండ నుంచి కల్వకుర్తి వైపు ఉన్న రోడ్డులో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు వేయడంతో రహదారిపై ఉన్న చెత్తచెదారం అంటుకొని మొక్కలకు వ్యాపించి మొక్కలు కాలిపోయినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ లక్ష్మణ్, కార్యదర్శి గిరి, గ్రామ పంచాయతీ సిబ్బంది, అగ్నిమాపక అధికారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రథోత్సవం



కల్వకుర్తి రూరల్: మండలంలోని మార్చాల త్రికూట వేంకటేశ్వర స్వామి దేవాలయంలో మూడు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. మంగళవారం చివరిరోజు రథోత్సవంలో వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని వీధుల వెంట రథాన్ని లాగేందుకు భక్తులు పోటీ పడ్డారు. మహిళలు, పురుషులు, యువకులు అధికసంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా గోవింద నామస్మరణ మార్మోగింది. భజనలు, కోలాటాలు, డీజే డ్యాన్సులతో ఆకట్టుకున్నారు. ఆలయ చైర్మన్ తలసాని కృష్ణారెడ్డి, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసంపై అవగాహన



తెలకపల్లి: మండల కాంప్లెక్స్ మీటింగ్ హాలులో ఆయా గ్రామాల యువకులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి ఎస్సీ ఈడీ రాంలాల్ మాట్లాడుతూ యువకులకు జీవనోపాధి కల్పించేందుకు రాజీవ్ యువ వికాస పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారన్నారు. స్వయం ఉపాధి కోసం రూ. 4 లక్షల వరకు ఇవ్వనున్నట్లు తెలిపారు. మండల ప్రత్యేక అధికారి రాంలాల్, ఎంపీఓ వెంకటయ్య, పంచాయతీ కార్యదర్శులు, యువకులు పాల్గొన్నారు.

నేడు చారకొండలో..

చారకొండ: మండల కేంద్రంలో రైతు వేదిక కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు రాజీవ్ యువ వికాస పథకానికి దరఖాస్తున్న వారికి అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్ మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. సకాలంలో అందరు హాజరు కావాలని కోరారు.

మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాం

కల్వకుర్తి రూరల్: మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పనే ధ్యేయంగా జాబ్‌మేళాలు నిర్వహిస్తునట్లు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆయన నివాసంలో మండలంలోని తాండ్ర, మార్చాల, పంజుగుల, సిలార్ పల్లి తదితర గ్రామాల చెందిన మహిళలు ఉపాధి కోసం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా హైదరాబాద్ నుంచి ఎలక్ట్రానిక్ కంపెనీ రప్పించి అర్హత ఉన్న మహిళలను ఇంటర్వ్యూ చేశారు. మొత్తం 14 మంది మహిళలు ఎంపికయ్యారు. మరో 46 మందికి వారం రోజుల్లో ఎలక్ట్రానిక్ కంపెనీలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు రానున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 200 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు. కార్యక్రమంలో ఐక్యత ఫౌండేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కూలీల సంఖ్య పెంచాలి

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఉపాధిహామీ కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీఓ ఆంజనేయులు కోరారు. మంగళవారం మండల కేంద్రంలో సాగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఫీల్డ్ అసిస్టెంట్ హన్మంత్‌శర్మ పంచాయతీ కార్యదర్శి పవన్‌కుమార్, తదితరులు ఉన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

బల్మూర్: పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం ఉంటారని ప్రిన్సిపాల్ పరంగి రవి సూచించారు. మండలంలోని కొండనాగుల ఉమామహేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ –1, 3 విద్యార్థులు మంగళవారం మండలంలోని రాంనగర్ కాలనీలో గ్రామస్తులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. పర్యావరణాన్ని కాపాడుకుందామని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ఆర్.వెంకటయ్య, జానుబాబు, గ్రామ కార్యదర్శి జ్యోతి, అధ్యాపకులు డా.కే.కృష్ణగోపాల్, గోపాల్, కిరణ్, కుమార్, మల్లయ్య, గాయత్రి, అధ్యాపకేతర సిబ్బంది నరసింహ్మారావు, ప్రేమ్‌నాయక్, రేషుక, శివమ్మ, చాంద్, విద్యార్థులు పాల్గొన్నారు.

వాటర్ బాటిళ్ల పంపిణీ

తాడూరు: మండలంలోని సిర్సవాడ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వాటర్ బాటిళ్లను మంగళవారం క్లాస్‌మేట్ వ్యవస్థాపక అధ్యక్షుడు వాస రాఘవేందర్ పంపిణీ చేశారు. జీహెచ్‌ఎం రమేష్, క్లాస్‌మేట్ క్లబ్ సభ్యులు ప్రసాద్, శ్రీనివాసులు, శ్రీనివాసచార్యులు తదితరులు ఉన్నారు.



డీసీఎంలో తరలిస్తున్న పశుగ్రాసం దగ్ధం

చారకొండ: మండలంలోని చంద్రాయన్‌పల్లిలో డీసీఎంలో తరలిస్తున్న పశుగ్రాసం దగ్ధమైన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం పశువుల మేత కోసం ఎండుగడ్డిని మల్లేపల్లి నుంచి కొనుగోలు చేసి చంద్రాయన్‌పల్లికి తరలిస్తున్నారు. చంద్రాయన్‌పల్లిలో విద్యుత్ తీగలు తగలడంతో నిప్పురవ్వలు పడి గడ్డి అంటుకుంది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి డీసీఎంను గ్రామ సమీపాన వ్యవసాయ పొలంలోకి తీసుకెళ్లి మంటలను ఆర్పేందుకు యత్నించాడు. అప్పటికే గడ్డి పూర్తిగా దగ్ధమైంది. రూ. 50 వేల వరకు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపాడు.

ఉపాధ్యాయుడిపై విచారణ చేపట్టాలి

కందనూలు: నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం జెడ్పీహెచ్‌ఎస్ మంగనూర్ కాంప్లెక్స్ పరిధిలోని ఓ తండా ప్రాథమిక పాఠశాలలో పనిచేసి ఇటీవలే డిప్యూటేషన్‌పై బిజినేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వచ్చిన ఓ ఉపాధ్యాయుడిపై విచారణ చేపట్టాలని బంజార గిరిజన విద్యార్థి సమైక్య జిల్లా అధ్యక్షుడు శ్రావణ్ కోరారు. ఈ మేరకు మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఫిర్యాదు చేసిన వారిలో గిరిజన విద్యార్థి నాయకులు సంతోష్, శ్రీను, వంశీ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన పీఆర్టీయూ నాయకులు

అచ్చంపేట రూరల్: ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణను మంగళవారం పీఆర్టీయూ నాయకులు హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో జిల్లా అధ్యక్షుడు రామచంద్రరావు, గౌరవ అధ్యక్షుడు బీచ్యానాయక్, ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

నాగర్‌కర్నూల్ క్రైం: అక్రమంగా తరలిస్తున్న రెండు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న ఘటన జిల్లా కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కుమ్మెర గ్రామానికి చెందిన శేఖర్ ఆటోలో రెండు క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని జిల్లా కేంద్రానికి తరలిస్తున్నాడు. సమాచారం అందుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వేములా నాయక్ ఆకస్మికంగా దాడి చేసి జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీలో ఆటోలో ఉన్న రేషన్ బియ్యాన్ని పట్టుకొని స్వాధీనం చేసుకున్నారు. రేషన్‌బియ్యాన్ని స్థానిక రేషన్‌దుకాణానికి తరలించారు.

సన్నబియ్యం పంపిణీ



పెద్దకొత్తపల్లి: మండలంలోని యాపట్ల, చిన్నకార్పముల గ్రామాల్లో మంగళవారం మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్ గౌడ్ సన్నబియ్యాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణయ్య, మల్లయ్య, బాలయ్య, రాజయ్య, పాల్గొన్నారు.

రోడ్డును నిర్మించాలి

కొల్లాపూర్ రూరల్: మండలంలోని అమరగిరి గ్రామానికి చెందిన రోడ్డు నిర్మించాలని బీజేపీ మండల నాయకుడు భరత్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం దెబ్బతిన్న బీటీ రోడ్డును కార్యకర్తలతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు మంత్రి జూపల్లి స్పందించి త్వరగా రోడ్డు పనులు ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

వంగూరు: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర రైతు కమిషన్ సభ్యులు కేవీఎన్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కొండారెడ్డిపల్లి, మిట్టసదగోడు గ్రామాల్లో రైతులకు స్ప్రింక్లర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ పాలనలో రైతులకు సబ్సిడీపై ఎలాంటి వ్యవసాయ పరికరాలు అందించలేదన్నారు. త్వరలో మండలంలోని అన్ని గ్రామాల్లో స్ప్రింక్లర్లు, ఇతర వ్యవసాయ పరికరాలను అందిస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్‌చైర్మన్ పండిత్‌రావు, కాంగ్రెస్ నాయకులు కృష్ణారెడ్డి, రమేష్‌గౌడ్, సురేందర్‌రెడ్డి, వేమారెడ్డి, లాలూయాదవ్ పాల్గొన్నారు.

వాటర్‌ట్యాంకు ప్రారంభం

మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో మాజీ సర్పంచ్ నర్సింహారావు, లక్ష్మమ్మల జ్ఞాపకార్థం కుమారులు రూ.లక్షతో నిర్మించిన వాటర్‌ట్యాంకును రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు కేవీఎన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా దాతలను అభినందించారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ పండిత్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ సురేందర్‌రెడ్డి, ఎంఈఓ మురళీమనోహరాచారి, మాజీ సర్పంచ్ గణేష్‌రావు, భాస్కర్‌రావు, యాదగిరిరావు, ఎల్లగౌడ్, హమీద్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా నిలుస్తాం



కల్వకుర్తి రూరల్: పట్టణంలోని సుభాష్ నగర్ కాలనీలో మారం రాకేష్ సోదరులకు చెందిన గానుగ నూనె, కంప్యూటర్స్ రిపేర్ సెంటర్లు ఉగాది రోజు అగ్నికి ఆహుతి అయ్యాయి. విషయం తెలుసుకున్న మంగళవారం ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ తోపాటు వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఇరుకుల రామకృష్ణలతోపాటు పలువురు రాష్ట్ర నాయకులు దుకాణాలను పరిశీలించారు. బాధితులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రూ. 3 లక్షలు ఆర్థికసాయం వెంట రేణిగుంట్ల గణేష్, జిల్లా అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జూలూరు రమేష్ బాబు, కార్యదర్శి కల్మచర్ల రమేష్, కోశాధికారి జగదీశ్వర్, అదన కార్యదర్శి శ్రీధర్, వాస శేఖర్, గంధం ప్రసాద్, బీచని బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం కోసం ఎదురుచూపులు

కోడేరు: మండల వ్యాప్తంగా రేషన్ దుకాణాలకు ప్రభుత్వం బియ్యం పంపిణీ చేసినా ఇప్పటికి లబ్ధిదారులకు అందించడం లేదు. గ్రామాల్లోని పేదలు బియ్యం కోసం వారం రోజుల నుంచి ఎదురుచూస్తున్నారు. రోజు రేషన్ దుకాణాల వద్దకు వచ్చి తిరిగి వెళ్లిపోతున్నారు. డీలర్లు మాత్రం మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభిస్తేనే రేషన్ బియ్యం పంపిణీ చేస్తామని లబ్ధిదారులకు తెలపడంతో అసహనం వ్యక్తం చేస్తూ ఇంటిబాట పడుతున్నారు. దీంతో పేదలు పస్తులు ఉండే పరిస్థితి దాపురించింది. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రేషన్ బియ్యం పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

వెల్దండ: మండలంలోని ఈదమ్మబండతండాకు చెందిన వరత్యవత్ మహిపాల్ నాయక్ మృతి చెందాడు. మంగళవారం బాధిత కుటుంబాన్ని జియాగూడ కమేల యాదవ సంఘం అధ్యక్షుడు జక్కుల చిన్న జంగయ్యయాదవ్ పరామర్శించి రూ.15వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట నాయకులు లాలునాయక్, రాజునాయక్, బుజ్జనాయక్, తదితరులు ఉన్నారు.

రథయాత్రను విజయవంతం చేయండి



చారకొండ: ధర్మసమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ విశారదన్ మహరాజ్ ఈనెల 14 నుంచి చేపట్టే లక్ష కిలోమీటర్ల మాభూమి రథయాత్రను విజయవంతం చేయాలని ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు సాయి మహరాజ్, మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ మహరాజ్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో అంబేద్కర్ సర్కిల్‌లో వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. మల్లేష్, మహేష్, విజయ్, రాధాకృష్ణ, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

దరఖాస్తులను పరిశీలించిన ఈడీ

పెద్దకొత్తపల్లి: రాజీవ్ యువ వికాస దరఖాస్తులను బీసీ కార్పొరేషన్ ఈడీ ఖాజా నజిమ్ అలీ దరఖాస్తులను పరిశీలించారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగేందర్, పంచాయతీ అధికారి లింగయ్య, పాల్గొన్నారు.

బడిబాట పోస్టర్లు, కరపత్రాలు విడుదల

కొల్లాపూర్ రూరల్: జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయంలో మంగళవారం మండలంలోని సింగోటం గ్రామ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి డీఈఓ రమేష్ కుమార్ బడిబాట కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ సింగోటం పాఠశాల ఉపాధ్యాయులు వేసవి సెలవుల కంటే ముందే బడిబాట నిర్వహణకు తమ స్వంత ఖర్చులతో పోస్టర్లు, కరపత్రాలు తయారు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ఇమ్మాన్యుయేల్, హెచ్‌ఎం కృష్ణప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దివ్యాంగుల రక్షణ చట్టాలపై అవగాహన

నాగర్‌కర్నూల్ క్రైం: మండలంలోని గగ్గలపల్లి గ్రామ పంచాయతీలో దివ్యాంగుల రక్షణ చట్టాలపై మంగళవారం డిప్యూటీ ఛీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీరాం ఆర్య అవగాహన కల్పించారు. దివ్యాంగులను కించపరిస్తే జైలు శిక్ష ఉంటుందని వివరించారు. దివ్యాంగులకు ఏవైన సమస్యలు ఉంటే హెల్ప్ లైన్ నంబర్ 14416కి ఫోన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ శశిరేఖ, గ్రామస్తులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

వెల్దండ: మండలంలోని చెర్కూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను మంగళవారం ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన నిబంధనల ప్రకారం ఇళ్లను నాణ్యతగా చేపట్టాలన్నారు. గ్రామంలో 24 మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు కాగా 13 మంది ఇళ్లను నిర్మించుకుంటున్నారన్నారు. ఇంటి నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన కొలతల ప్రకారం ఇంటి నిర్మాణం చేస్తేనే బిల్లులు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ లక్ష్మణ్, కార్యదర్శి హరిణి, తదితరులు ఉన్నారు.

గ్యాస్, డీజిల్ ధరలను తగ్గించాలని నిరసన



నాగర్‌కర్నూల్ రూరల్: పెంచిన గ్యాస్, డీజిల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని బొందలపల్లిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ పార్టీ శాఖ కార్యదర్శి అచపాక సురేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్యాస్‌పై రూ.50లు డీజిల్, పెట్రోల్‌పై రూ.2 లు పెంచడంతో సామాన్యులు ఇబ్బందులు పడుతారన్నారు. పేదలపై భారం మోపడం సరికాదన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సుభాస్, శివరాం, బద్రి, కుమార్, భరత్, కురుమయ్యలు పాల్గొన్నారు.

అధికారుల హామీతో దీక్ష విరమణ



తెలకపల్లి: మండలంలోని కారువంగలో పల్లె దవాఖానాను ప్రారంభించి ప్రజలకు సేవలు అందించాలని సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 7 నుంచి రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. రెండోరోజు మంగళవారం ఎంపీఓ వెంకటయ్య, పంచాయతీ కార్యదర్శి కాశింలు, కారువంగ గ్రామానికి చేరుకొని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి వారం రోజుల్లో పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో నాయకులు సుముఖత తెలపడంతో నిమ్మరసాన్ని ఇచ్చి దీక్షలను విరమింపజేశారు. ఎంపీఓ వెంకటయ్య, మాజీ ఉప సర్పంచ్, గోరటి కాశన్న పాల్గొన్నారు.

పంటరుణాలు ఇవ్వాలి

పెద్దకొత్తపల్లి: రైతులకు సకాలంలో పంట రుణాలు ఇవ్వాలని బీజేపీ నాయకులు మంగళవారం సింగిల్ విండో అధికారి వెంకటస్వామికి వినతి పత్రాన్ని ఇచ్చారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు పరశురాములు మాట్లాడుతూ సింగిల్ విండోలో కొత్తగా పంటరుణాలు తీసుకున్న రైతుల వద్ద 10 శాతం షేర్ పైసలు సింగిల్ విండో అధికారులు తీసుకుంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ప్రవీణ్‌కుమార్, భీమేశ్వర్ రెడ్డి తిరుమల్‌యాదవ్, మార్కండేయ, శేఖర్‌యాదవ్ పాల్గొన్నారు.

ఓర్వలేకనే విమర్శలు

అచ్చంపేట రూరల్/వంగూరు/బల్మూర్/మన్ననూర్: నాగర్‌కర్నూల్ జిల్లాలోని పలు మండలాల్లో కొనసాగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ప్రభుత్వాన్ని మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అసత్య ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు విమర్శించారు. మంగళవారం అచ్చంపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేందర్, మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడారు. అదేవిధంగా వంగూరులో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, మార్కెట్ వైస్ చైర్మన్ పండిత్‌రావు, బల్మూరులో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మన్ననూరులో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పంబలి బుచ్చయ్య, మాజీ ఎంపీటీసీలు శ్రీనివాసులు మాట్లాడుతూ అచ్చంపేట నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణను విమర్శిస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు.